వైఎస్ఆర్
కడప-అన్నమయ్య వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం 09 మార్చి 2026

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత..

కడప కార్పొరేషన్, మార్చి 8 ప్రభాతవార్త:

నగరంలోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి సారధ్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ సప్లై డైరెక్టర్ సుబ్బరాయుడు హాజరయ్యారు. కండూకూర్ జుబేద,నాగరత్నమ్మ, రాధాబాయి,వల్లిపు లక్ష్మీదేవి లకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో నేడు రాణిస్తున్నారని కొనియాడారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలను సన్మానించడం తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా మహిళలకు ఇష్టమైన రంగాల్లో వారు ఎదిగేలా తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు గురుస్వామి,సుంకేసుల బాదుల్లా, ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు, చేలో రవి, శ్రీనివాసులు, నరసింహ,నగర కమిటీ అధ్యక్షులు గొడుగునూర్ హరికుమార్, ప్రచార కమిటీ అధ్యక్షులు రాణా ప్రతాప్, ఓబయ్య, చిన్న కుల్లాయప్ప, మునిరత్నం గౌడు పాల్గొన్నారు.

రంగనాయకుల స్వామి అలంకారంలో
భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

బద్వేలు అర్బన్, మార్చి 8, ప్రభాతవార్త

బద్వేలు మండలంలోని లక్ష్మీ పాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం చివరి రోజు రంగనాయకుల అలంకారం పూలంగి సేవ అలంకారంలో స్త్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు స్థానిక దాతలు మెటా వెంకట రమణయ్య కుటుంబం వారు ఈ కార్యక్రమాన్ని జరిపించారు. వైకుంఠములో శ్రీమన్నారాయణ మూర్తి ఏ విధంగా కొలువుతీరి ఉంటాడో అదే విధంగా రంగనాయకుల స్వామి అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మహాభాగ్యం పొందారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తృప్తి ఇక్కడ స్వామిని దర్శించుకున్న తర్వాత మాకు కలి గిందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు ప్రత్యేక పూజలు నిర్వహించారు మొక్కలు తీర్చుకున్నారు ఆలయ కమిటీ వారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అందరికీ శ్రీవారి దర్శనం కలిగేలా ఏర్పాటు చేశారు దర్శనం అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చాటకొండ సత్య సంజీవ కుమార్ ఆలయ ధర్మకర్తలు పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి

దేశాభివృద్ధిలో మహిళదే కీలకపాత్ర : ఎమ్మెల్యే మాధవి రెడ్డి

సమాజంలో ప్రతి మహిళా ఒక యోధురాలు : జాయింట్ కలెక్టర్ నిధి మీనా

మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం : జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

గివ్ టు గైన్ అనే థీమ్ తో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

కడప జిల్లా, మార్చి 8 ప్రభాతవార్త:

మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు.ఆదివారం జిల్లా యంత్రాంగం, డీఆర్డీఏ సెర్ప్, మెప్మా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మేడా కన్వెన్షన్ సెంటర్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పి విశ్వనాథ్, ప్రభుత్వ విప్ మరియు కడప శాసనసభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలో 2025, 26 ఆర్థిక సంవత్సరానికి సంబంచింది మెప్మా, డీఆర్డీఏ స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల పంపిణీ కింద 2315.19రూ కోట్ల మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమానంతరం జిల్లా మహిళా అధికారులను, ద్వాక్రా సంఘాల వ్యాపారవేత్తలను, మహిళా అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సాధికారత సాధనలో భాగంగా ప్రతి ఒక్క మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారత కోసం 1995, 96 లో మొదటి సారి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి కుటుంబంలోనీ మహిళ ఇందులో భాగస్వామ్యంగా ఉన్నారన్నారు. కుటుంబంలోనీ అందరూ భోం చేసిన తర్వాత కాకుండా మహిళలు అందరితో కలిసి భోజనం చేసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. అప్పుడే ప్రతి కుటుంబం బంగారు కుటుంబం అవుతుందన్నారు. భారతదేశం గొప్ప ఆర్థిక శక్తిగా ఎదగడానికి కారణం మహిళలే కారణం అన్నారు. మహిళల భద్రత పట్ల ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఎలాంటి సమస్యలు ఉన్న పోలీస్ వారికి తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాబోవు కాలంలో దేశానికి మహిళలు దశా దిశగా మారనున్నారన్నారు.మహిళలు కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు సమానంగా నిర్వహిస్తూ కుటుంబానికి వెన్నుగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసే ప్రతి కార్యక్రమంలో మహిళలకు అధిక ప్రాధాన్యత నిస్తూ వారి పేరు మీద పథకాలు ప్రారంభించారన్నారు. మహిళలు వత్తిడి తగ్గించుకోవాలన్నారు. సమాజంలో ఉత్తమ ఆర్థికవేత్త ఎవరైనా ఉన్నారంటే వారు మహిళలే అన్నారు.పొదుపు సంఘాల్లో దాదాపు 85 లక్షల మంది మహిళలు సభ్యులుగా చేరి కోట్ల రూ. లబ్ధి పొంది వ్యాపారవేత్తలుగా ఎదిగారన్నారు. జాయింట్ కలెక్టర నిధి మీనా మాట్లాడుతూ ఈ రోజు ప్రత్యేకమైన రోజు అన్నారు. సమాజంలో మహిళల పాత్ర అమూల్యమైనదన్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరి కలలను సహకారం చేయడానికి అలుపెరుగని యోధురాలుగా పనిచేస్తుందన్నారు. కుటుంబానికి మహిళలంటే ఒక శక్తి అనేది ఒక నమ్మకమని ఒక విజయం అన్నారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల భద్రతకు అధ్యధిక ప్రాముఖ్యతనిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళల భద్రత కోసం112 కాల్ సెంటర్‌కు పాన్ చేసి తమ సమస్యలను తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు.కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గొరవం, భద్రత, సమానత్వం మహిళలకు ఎంతో అవసరమన్నారు.మహిళలు ఆర్థిక వేత్తలుగా ఎదగాలన్నారు.మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. డి ఆర్ డిఎపిడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళల హక్కులు, మహిళా దినోత్సవ చరిత్ర గూర్చి వివరించారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గివ్ టు గైన్ అనే థీమ్ తో జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పి.డి రమా దేవిమెప్మా పిడి కిరణ్ కుమార్, డిఆర్‌డిఎ పిడి రాజ్యలక్ష్మి,జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం చాంద్ భాష, కడప నగర కార్పొరేషన్ రాకేష్ చంద్ర, నగర కార్పొరేటర్లు అరుణ ప్రభ, లక్ష్మీదేవి, జ్యోతి, స్వప్న, జిల్లా అధికారులు, ద్వాక్రా గ్రూప్ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం మరువలేనిది

మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ద్వాక్రా సభ్యురాలుగా చేరిన నాటినుండి సమాజంలో మహిళలకు ఎన్ని అవకాశాలు ఉన్నాయో తెలిసాయన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో మహిళా వ్యాపారం ప్రారంభించి కుటుంబ పోషణ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

లక్ష్మీదేవి, డ్వాక్రా సంఘం సభ్యురాలు.

మహిళా వ్యాపారవేత్తగా ఎదగడం గర్వంగా ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. అందులో భాగంగా నేడు మన జిల్లా నుండి గృహలక్ష్మి ఆహార ఉత్పత్తులను స్థాపించి దాదాపు 45 రకాల ఉత్పత్తులను తయారు చేసి మూడు దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మహిళా వ్యాపారవేత్తగా ఎదిగినందుకు ఆమె తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. ప్రభుత్వం నుంచి ఆర్థికంగా 80 లక్షలు సబ్సిడీ పొందడం ఆనందంగా ఉందన్నారు.

మీనా, గృహ లక్ష్మి ఫుడ్ వ్యవస్థాపకురాలు.

మహిళల్లో అపార శక్తి ఉంది

ద్వాక్రా గ్రూపులో చేరకముందు నేను ఒక సాధారణ మహిళగా గుర్తింపు ఉందని ఇప్పుడు ద్వాక్రా సంఘంలో చేరిన తర్వాత మహిళల స్థితిగతులు పూర్తిగా మారాయన్నారు అందుకు ఉదాహరణగా నా జీవితమే ఉందన్నారు. ద్వాక్రా గ్రూపులో చేరడం ద్వారా ఆర్థికంగా కుటుంబానికి సహాయం చేకూరిందన్నారు. మహిళల విలువలు, ఆరోగ్యం, మహిళల్లో అపార శక్తి ఉందని నాకు ఈ ద్వాక్రా గ్రూపు ద్వారా అవగాహన పొందానని సంతోషాన్ని వెల్లబుచ్చారు.

లక్ష్మీదేవి, డ్వాక్రా గ్రూపు సంఘం సభ్యురాలు.

బోయినపల్లి లేడీస్ హాస్టల్‌లో
రహస్య సిసి కెమెరాల కలకలం

మార్ఫింగ్ వీడియోతో అలజడి, సీసీ కెమెరాలు ధ్వంసం

హాస్టల్ నిర్వాహకుడికి బట్టలు ఊడదీసి దేహశుద్ధి

రాజంపేట, మార్చి 8 ప్రభాతవార్త

ఘర్షణ జరిగిన బోయినపల్లిలోని హాస్టల్ ఏరియా

వేలాదిమంది విద్యార్థులు ఉండే రాజంపేట మండలం బోయినపల్లిలోని ఓ లేడీస్ హాస్టల్‌లో జరిగిన ఓ సంఘటన కలకలం సృష్టించింది. ఓఅమ్మాయికి సంబంధించి ఓ వీడియో బయటకు రావడంతో అలజడి రేగింది. విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక యూనివర్సిటీ విద్యార్థులు ప్రియా లేడీస్ హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్ నిర్వాహకుడు గిరిపై కొందరు దాడికి దిగారు. హాస్టల్లో రహస్య కెమెరాలు పెట్టారని ఆ మాచారం. ఈ కెమెరా ద్వారా తీసిన వీడియోలను మార్ఫింగ్ చేసి నీచమైన పనికి పాల్పడతావా అంటూ దాడి చేశారు. ఓ అమ్మాయికి సంబంధించి మార్ఫింగ్ చేసిన వీడియో గిరి బయటికి పెట్టడమే దీనికి కారణం అని సమాచారం. లేడీస్ హాస్టల్ నడుపుతూ పనికిమాలిన పని చేశావని అమ్మాయిల జీవితంతో ఆడుకుంటూవా అంటూ విరుచుకుపడ్డారు. గిరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని అక్కడ ఉంటున్న విద్యార్థులు చెప్తున్నారు. గిరి చేతికి ఉన్న స్మార్ట్ వాచ్‌లో వీడియోలు ఉండడంతో దాన్ని కూడా నేలకేసి కొట్టారని తెలిసింది. కలకలం రేపిన వీడియో అప్పటికే వైరల్ అయిందని చెబుతున్నారు.ఈ విషయంలో పోలీసుల వైఖరి పై విద్యార్థులు అసమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మన్నూరు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. సంఘటనకు దారి తీసిన వివరాలపై ఆరా తీశారు.ఈ విషయమే వార్త వివరణ కొరగా ఘర్షణకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే గాయాలకు గురైన వ్యక్తి తిరుపతి ఆసుపత్రికి వెళ్లారని చెప్పారు.

విద్యుత్ ఘాతంతో ఇద్దరి మృతి...

ఉయ్యాల ఊగుతుండగా షాక్

మనవరాలిని కాపాడబోయి అమ్మమ్మ, జాతరకు వచ్చిన బంధువు బలి

రెడ్డివారిపల్లెలో మిన్నంటిన రోదనలు

మదనపల్లె క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.

ఆనందోత్సాహాల మధ్య సాగాల్సిన గంగమ్మ జాతర ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. కురబలకోట మండలం ముదివేడు జాతర సందర్భంగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. జాతర కోసం కుమార్తె ఇంటికి వచ్చిన పద్మావతి (55), బెంగళూరు నుంచి వచ్చిన వెంకటేష్ (40) లు మృతి చెందారు. ఆదివారం రెడ్డివారిపల్లెలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బాధితుల కథనం మేరకు.. రెడ్డివారి పల్లి చెందిన జగదీష్, సునీత దంపతులు ముదివేడు జాతర ఘనంగా నిర్వహించాలనుకున్నారు. ఇందుకోసం పుంగనూరు మండలం గొల్లపల్లిలో నివాసం ఉన్న సునీత తల్లి పద్మావతి, బెంగళూరులో ఉన్న తన అక్క అనిత, బావ శివ కుమార్ రెడ్డి లను జాతరకు ఆహ్వానించింది. దీంతో అనిత,్ద శివకుమార్ లు తమ పిల్లలు మధుప్రియ, లిఖితారెడ్డిలతో పాటు పక్కింటి వ్యక్తి వెంకటేష్‌తో కలిసి జాతరకు వచ్చేశారు. ఆదివారం ఉదయం అనిత కుమార్తెలు మధుప్రియ, లిఖితారెడ్డి ఇంటిముందు రేకుల షెడ్డు కింద ఏర్పాటుచేసిన ఉయ్యాలలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఉయ్యాలకు విద్యుత్ సరఫరా కావడంతో పిల్లలిద్దరూ విద్యుత్ ఘాతానికి గురై గట్టిగా కేకలు వేశారు. దీనిని గమనించిన అమ్మమ్మ పద్మావతి ప్రాణాలకు తెగించి పిల్లలను ఉయ్యాల నుంచి పక్కకు నెట్టేసింది. ఆ క్రమంలో ఆమె ఉయ్యాలకు అతుక్కుపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో బెంగళూరు నుంచి వచ్చిన వెంకటేష్ కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దురదృష్టవశాత్తూ పద్మావతి, వెంకటేష్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన చిన్నారి మధుప్రియను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విషాదంలో మునిగిన గ్రామం

సంతోషంగా జాతర జరుపుకోవాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన వారు మృత్యువాత పడటంతో రెడ్డివారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి. ముదివేడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెడ్డివారిపల్లెలో కరెంట్ షాక్ కొట్టి ఇద్దరు మృతి చెందిన బాధితుల కుటుంబాలను మదనపల్లి శాసనసభ్యులు యం. షాజహాన్ భాష మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నందు పరామర్శించారు. సంఘటన జరిగిన విషయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తానన్నారు.

భారతీయ సంస్కృతిలో మహిళలకు విశిష్ట స్థానం

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

మహిళలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

సదస్సుకు హాజరైన మహిళలు

భారతీయ సంస్కృతిలో మహిళలకు విశిష్ట స్థానం ఉన్నదని, మహిళల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ బృందం ఏర్పాటు, సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పి ధీరజ్ కునుబిల్లి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్,ఎస్పి, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటారన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటినుంచే మహిళలకు సమాన హక్కులు కల్పించబడిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలో మహిళలకు విశిష్ట స్థానం కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వ విశేష ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి రంగంలో విద్యా, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు దక్కిందన్నారు. జిల్లా ఎస్పి ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయికి వెళ్ళి మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలపై, చిన్నపిల్లలకు ఎటువంటి అన్యాయం జరిగినా దానిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీస్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. కుటుంబం నుంచి సమాజ నిర్మాణం వరకు మహిళల సేవలు అపారమని, మహిళలే కుటుంబానికా ఆధారం, సమాజానికి మార్గదర్శకులని తెలిపారు. ప్రతి విజయం వెనుక మహిళ ప్రోత్సాహం, త్యాగం, కృషి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, గృహ నిర్మాణ పథకాలు, గ్యాస్ సిలిండర్ల పంపిణీ, పెన్షన్, ఆర్థిక బరోసాలు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం వెలుగు స్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శన అందరిని అలరింపచేసింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడి హైమావతి, హార్టికల్చర్ అధికారిణి సుభాషిణి, డిఆర్‌డిఏ పీడి నాగేశ్వర్‌రావు, మెప్మా పీడి లక్ష్మి, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

రాయచోటి టౌన్ మార్చి 8 ప్రభాతవార్త

రాయచోటి నియోజకవర్గం, ఆర్డీవో కార్యాలయం నందు ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి పరిమితం కాకుండా ఆర్థిక వ్యవస్థలో, విద్య వ్యవస్థలో, ఉద్యోగ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా ఉండాలని మహిళను ఉద్దేశించి ప్రస్తావించడం జరిగింది. మన తెలుగుదేశం ప్రభుత్వము వంటింటి భారాన్ని తగ్గించేందుకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందించడం జరిగింది అలాగే ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటికే మహిళలు లబ్ధి పొందారని తెలిపారు. డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం, ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించడం,"తల్లికి వందనం" పథకం ద్వారా 67 లక్షల మంది తల్లులకు రూ.10 వేల కోట్లను నేరుగా ఖాతాల్లో జమ చేయడం వంటి పథకాలు మహిళల సాధికారతకు తోడ్పడుతున్నాయని తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యం

కడప క్రైం, మార్చి 8, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు టుటౌన్ పీఎస్ పరిధిలోని లాడ్జీలు, డార్మిటరీలను ఎస్సై రాఘవేంద్రరెడ్డి తన సిబ్బందితో పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి అనువణువు తనిఖీ చేశారు. లాడ్జీలలో బస చేసే వ్యక్తుల ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల నిర్వహణ సరిగా ఉన్నదా అని ఆరా తీశారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చినా చట్టప్రకారం చర్యలు నిర్వాహకులకు ఎస్సై హెచ్చరించారు.

3 చోట్ల చోరీలు

దువ్వూరు, మార్చి 08, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో శనివారం రాత్రి 3 చోట్ల చిన్న చిన్న చోరీలు జరిగాయి. దువ్వూరుకు సమీపంలోని ఒక టీ బంకులో తాళాలు పగుల గొట్టి బంకులో ఉన్న సిగరెట్లు ఇతర వస్తువులను తీసుకెళ్లారు. అలాగే పాత దువ్వూరులో ఉన్న గోరి స్వామి దర్గా వద్ద ఉన్న ఇంటిని అలాగే రామ్ సాయి నగర్ రహదారిలో ఉన్న శివాలయం వద్ద ఉన్న హుండిని పగలగొట్టి అందులో ఉన్న డబ్బులను తీసుకు వెళ్లారు. మూడుచోట్ల అధిక మొత్తాలే ఉన్నట్లు అక్కడ ఉన్న బాధితులు తెలిపారు. ఏది ఏమైనా ఉన్నట్లు ఉండి మూడు చోట్ల చోరీలు జరగడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ మూడు ప్రదేశాలను దువ్వూరు పోలీసులు పరిశీలించారు.

కడప తాడిపత్రి జాతీయ రహదారి
ఈత చెట్టు వద్ద రోడ్డు ప్రమాదం

స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కడప జిల్లా వల్లూరు మండలం ఈత చెట్టు దగ్గర పెట్రోల్ బంక్ ఎదురుగా ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలు... స్థానికులు గాయపడిన వ్యక్తులను 108 వాహనం ద్వారా కడప రిమ్స్ కు తరలింపు గాయపడిన వ్యక్తుల వివరాలు తెలియలేదు ప్రమాదానికి గల పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రొద్దుటూరు అర్బన్,మార్చి8, ప్రభాతవార్త

మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఖాదరబాద్ గ్రామంలో రంజాన్ మాసం పురస్కరించుకొని హ్యూమన్ రిలీఫ్ ఫౌండేషన్ స్థాపకులు షేక్ అమీన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం నాయకులు గుమ్మల్ల రవిశంకర్ రెడ్డి,శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ షఫీ అహ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా వాకథాన్

మదనపల్లె క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం అన్నమయ్య జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వాకథాన్ వేడుకలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. మహిళా శక్తిని చాటుతూ, వారి భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ భారీ ర్యాలీని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మిషన్ కాంపౌండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఎస్పీ స్వయంగా మహిళలతో కలిసి దాదాపు 2 కిలోమీటర్ల నడిచి వారిలో ఉత్సాహాన్ని నింపారు. మిషన్ కాంపౌండ్ నుంచి బిటి కళాశాల వరకు ఈ వాక థాన్ కొనసాగింది. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో విద్యార్థులు ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా మహిళలను వేధిస్తున్న ఆకతాయిలను ఎలా ఎదుర్కోవాలో, ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలో విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ సమాజ ప్రగతిలో మహిళల పాత్ర వెలకట్ట లేనిదని కొనియాడారు. మహిళలకు ఎక్కడైనా, ఏ సమయంలోనైనా ఇబ్బం దులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహి ళలు అపాయంలో ఉన్నప్పుడు 112 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. శక్తి టీమ్స్, శక్తి యాప్ సేవలను వినియోగించుకోవాలన్నారు. మహిళల ఆత్మవిశ్వా సాన్ని దెబ్బతీసే శక్తులను అణిచివేసేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వాకథాన్‌లో చురుగ్గా పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్న 10 మంది మహిళలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, వివిధ విభా గాల సీఐలు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, మహిళలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం వివాదంతో వ్యక్తిపై దాడి

మదనపల్లె క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.

ఇంటి స్థలం విషయమై జరిగిన ఘర్షణలో ఒకరిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలం, ఎర్రబల్లి పంచాయతీ, బాపనపల్లి కు చెందిన నూర్ భాషా నజీర్ (64) కు గ్రామంలో కొంత ఇంటి స్థలం ఉంది. అయితే మమత గ్రామకంఠం స్థలములో ఇంటి నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో నజీర్ అడ్డుకున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామ కంఠం భూమికి నోటీసులు అంటిస్తామని తెలిపారు. అప్పటివరకు గ్రామకంఠ భూములోకి ఎవరు వెళ్ళకూడదని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే ఆ భూమిలో మమత ఇంటి నిర్మాణానికి పూనుకోవడంతో నజీర్ అడ్డుకున్నాడు. రెవెన్యూ అధికారులు హెచ్చరికలు కాదని ఇంటి నిర్మాణం చేపట్టడం సబబు కాదని నజీర్ తెలపటంతో మమత కుటుంబ సభ్యులు నీ స్థలం కాదని, ప్రభుత్వం నాకు పట్టా ఇచ్చిందని ఎదురు తిరిగారు. దీంతో ఇరువురు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆగ్రహించిన మమతా, నరసింహులు మాధవి, బి. నరసింహులు, ఉష, సుధాకర్, వెంకటరమణ, శివ, అజయ్ లు నజీర్ పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దాడిలో గాయపడిన బాధితున్ని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామంలో అందరూ ఏకమై తమపై తరచూ దాడులకు దిగుతున్నారని బాధితులు వాపోయాడు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మిట్స్ యూనివర్సిటీకి జాతీయస్థాయి డిజిటల్ స్కిల్లింగ్ ఎక్సలెన్స్ అవార్డు

కురబలకోట మార్చి 8 ప్రభాతవార్త

కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి సమీపంలోనిమిట్స్ డీమ్డ్‌టుబి యూనివర్సిటీకు జాతీయ స్థాయిలో డిజిటల్ స్కిల్లింగ్ ఎక్సెన్స్ అవార్డు లభించినట్లు ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్ విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. న్యూ ఢిల్లీలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో మిట్స్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ డిజిటల్ భారత్ టాలెంట్ కాన్క్లేవ్ -2026 కార్యక్రమంలో భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డు ను అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డు అందజేసిన నాస్కామ్ సంస్థకు మిట్స్ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ యెన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సిడిపిఓలు రాజమ్మ, భారతి

పీలేరు, మార్చి 08 ప్రభాతవార్త:

సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవోలు రాజమ్మ, భారతి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీలేరు. వాల్మీకిపురంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్లను, అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలు, ప్రతిభ చూపి ను ఆయాలను ఘనంగా సన్మానించారు. గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందించడంలో అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, ఉమా, శాంతమ్మ. అన్నపూర్ణ, భారతి సిబ్బంది పాల్గొన్నారు.

అవయవ దానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు మార్చి 8 ప్రభాతవార్త

అవయవ దానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వూరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవయవ దాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుండి ఐఎంఏ భవన్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున డాక్టర్లు, రోటేరియన్లు, వెటర్నరీ కళాశాల సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఐఎంఏ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ అవయవ దానం పట్ల ఆధునిక సమాజంలో కూడా చాలామందికి అపోహలు వున్నాయని, వాటిని విస్మరించి ప్రతి ఒక్కరూ మరణానంతరం అవయవ దానం చేయాలని, కిడ్నీ వంటివి బ్రతికున్న సమయంలో చేసే దానాలు చేయాలని వివరించారు. అనంతరం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అవయవదానం పై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై వుందన్నారు. అవయవదానం చేసేందుకు ఇటీవల కాలంలో చాలామంది ఆసక్తితో వున్నా చేసే మార్గం తెలియదని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమ నిర్వహణ ప్రశంసనీయమన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ 2003లో తనకు లివర్ మార్పిడి జరిగిందని, 2007లో కిడ్నీ మార్పిడి జరిగిందని వివరించారు. తనకు కాలేయం అందించిన యువతి జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి మహిళలకు తక్కువ వడ్డీ రుణాలు, కుట్టు మిషన్ల పంపిణీ, పలు అవగాహన కార్యక్రమాలు చేశానని, గత సంవత్సరం 3కె, 5కె రన్ నిర్వహించామని, ఈ సంవత్సరం ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని వివరించారు. అవయవ దానం తర్వాత తాను ఆరోగ్యంగా వున్నానని తిరుమల, విజయవాడ పాదయాత్ర కూడా నిర్వహించానని వివరించారు. అనంతరం ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని సూచించారు. అవయవదానం చేసే వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సాహం వుంటుందని తెలిపారు. కాగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అవయవ దానం ఫాం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ సురేష్ శ్రీనివాస్, రొటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం: సీఐ రామకృష్ణ

బద్వేలు, మార్చి 8, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బద్వేలు పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌తో పాటు 112 అత్యవసర సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే నియంత్రణ గదికి సమాచారం చేరి, తక్కువ సమయంలోనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే విధంగా వ్యవస్థ అమలులో ఉందని తెలిపారు. మహిళల రక్షణకు 112, 1091, 181, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. యువతులు అపరిచితుల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు పెరుగు తున్న నేపథ్యంలో ఫేక్ లింకులు, యూపీఐ, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా వేధింపులపై జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మొబైల్‌లో శక్తి యాప్ ఉంటే పోలీస్ రక్షణ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

దేవాలయాలు నేటి ఆధ్యాత్మిక కేంద్రాలు

గాలివీడు, మార్చి 8(ప్రభాతవార్త):

దేవాలయాలు నేడు ఆధ్యాత్మిక కేంద్రా లుగా విరజిల్లుతున్నాయని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని పందికుంట పంచాయతీ వెంకటాపురం సమీపంలో శ్రీ వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నదని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 9 కోట్ల 60 లక్షల నిధులతో వివిధ ఆలయాల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. భక్తిభావం కలవారు మంచి మార్గంలో నడుస్తారని తద్వారా సమాజం కూడా అభివృద్ధి చెందు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూలికుంట సర్పంచ్ పార్థసార థిరెడ్డి, నూలివీడు సొసైటీ అధ్యక్షులుప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామాంజులురెడ్డి, అమరనాథరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన మఠాధిపతులు

బ్రహ్మంగారిమఠం మార్చి 8

మండల కేంద్రంలోని తెలుగు గంగ ప్రాజెక్టుకు పోవు దారి యందు నూతనంగా ఏర్పాటు చేసిన పట్రా నాయుళ్ళ అన్నదాన సదనం మరియు కళ్యాణ మండపాన్ని ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం పీఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారు వేద మంత్రాలు భాజ భజంత్రీల నడుమ ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్రా సంఘం వారు మన మఠంలో నిర్మించడం భక్తులకు ఎంతో మంచిదని అన్నారు. అనంతరం ఆయన భోజనశాలను పరిశీ లించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆంజనే యులు, అధ్యక్షులు తిప్పన బ్రహ్మయ్య, కోశాధికారి కొండ నారాయణ, డైరెక్టర్లు మాధవ నాయుడు, సారె రామానాయుడు, ఎక్సైజ్ డీఎస్పి రమేష్, తాసిల్దార్ బాలా నాయుడు, వేలాదిమంది పట్రా కులస్తులు పాల్గొని జయప్రదం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

వార్డెన్లు సేవాభావంతో పనిచేయాలి

ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

మదనపల్లె క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.

సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. గత మూడు రోజులుగా అన్నమయ్య జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, అంగన్ వాడీ కేంద్రాలు. చౌక దుకాణాలను తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం మదనపల్లె పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ, బీసీ వసతి గృహాలను తనిఖీచేశారు. స్థానిక ఆర్‌అండ్ బి అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలకు, విద్యార్తులకు అందించే ఆహార పదార్థాలు, ప్రభుత్వ హాస్టల్లలో పిల్లలకు అందుతున్న ఆహార పదార్థాలపై తనిఖీచేసేందుకు ప్రభుత్వం తనను నియమించిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్టలలో తనిఖీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని వసతి గృహాల్లో వ్యవస్థ బాగుందని, విద్యార్థులకు వస్తువులు సవ్యంగానే అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వసతి గృహాల్లో బాత్రూంలకు తలుపులు సరిగా లేవని గుర్తించినట్లు తెలిపారు. ఇటువంటి చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం 2023లో మెనూ ఛార్జీలను పెంచినప్పటికీ, ప్రస్తుత ధరలకు అవి సరిపోవని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ప్రతి ఏటా విద్యార్థులకు వంద రూపాయల చొప్పున ఛార్జీలు పెంచితే మరింత నాణ్యమైన భోజనం అందించే అవకాశం ఉంటుందని సూచించారు. వార్డెన్లు, అధికారులు పేద విద్యార్థులకు పెట్టే అన్నంలో అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన చేయకూడదని, అటువంటి కక్కుర్తి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సేవాభావంతో పనిచేయాలని హితవు పలికారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సివిల్ సప్లై కార్యాలయాల్లో పరిస్థితులు సంతృప్తికరంగానే ఉన్నాయన్నారు.

రాయలసీమ ఓపెన్ తైకాండోలో 13 మందికి మెడల్స్

మైదుకూరు, మార్చి 08, ప్రభాతవార్త:

రాయలసీమ ఓపెన్ తైకాండో ఛాంపియన్షిప్ 20 26 ఫిబ్రవరి లో 14, 15వ తేదీలో ఓపెన్ క్యాటగిరి నంద్యాలలో జరిగిన పోటీలో మైదుకూరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినారు. కోచ్ మాస్టర్ జిలాని భాష ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థులు పాల్గొనగా 5 మందికి గోల్డ్ మెడల్, 5 మందికి సిల్వర్, 3 బ్రాంచ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ మెడల్స్ సాధించిన బాల బాలికలకు ఆదివారం మైదుకూరు స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సర్కిల్ లో పట్టణ ఎస్సై చిరంజీవి చేతుల మీదుగా మెడల్స్ అందించడం జరిగింది. అనంతరం ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో రాణిస్తూ ఎన్నో మెడల్స్ సాధించాలని. ముఖ్యంగా బాలికలు ఈ రోజుల్లో తైక్వాండో శిక్షణ చాలా అవసరమని వారి రక్షణ, భద్రత తో పాటు కరాటే శిక్షణ సాటి మహిళలను కూడా రక్షించడానికి ఉపయోగపడుతుందని తప్పకుండా బాలికల విద్యార్థులు ఈ తైకాండో శిక్షణ లో నైపుణ్యత పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపి రవీంద్ర, తైకాండో మాస్టర్లు సగిలి సాగర్ ఝాన్సీ, బి.వి బాలాజి, విద్యార్థుల తల్లిదండ్రులు వీరభద్ర, హరి ప్రసాద్, సుబ్బరాయుడు, జాకీర్, గోవర్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం రోజున గ్యాస్ ధరల పెంపు అన్యాయం

ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు, మార్చి 8, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్యాయం చేశాయని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా విమర్శించారు. ఆదివారం తన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా గృహ వినియోగ గ్యాస్‌పై రూ.60, కామర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచుతూ నిర్ణయం తీసుకోవడం మహిళలకు వంటింట్లో మంట పెట్టడమేనని విమర్శించారు. మహిళా దినోత్సవం రోజున మహిళలకు సంక్షేమ పథకాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశించిన సమయంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన రూ.1500 ఆర్థిక సహాయం వాగ్దానం అమలు చేయకుండా, గ్యాస్ ధరలను పెంచడం దురదృష్టకరమని విమర్శించారు. గ్యాస్ ధరలు పెరిగినా కూడా సిలిండర్ కోసం ప్రజలు 25 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. డబ్బులు చెల్లించినా 25 రోజుల ముందు గ్యాస్ సిలిండర్ డెలివరీ ఇవ్వకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రస్తుతం రంజాన్, ఉగాది, శ్రీ రామనవమి, ఈస్టర్, గుడ్ ఫ్రైడే వంటి పండుగల సమయంలో గ్యాస్ కొరత ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ధరల పెంపుతో పాటు గ్యాస్ సరఫరాలో ఆలస్యం కూడా ప్రజలపై ద్వంద్వ భారం మోపుతోందని విమర్శించారు. అంతేకాకుండా, దేశ విదేశాంగ విధానంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. గ్రతంలో మాజీ ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, మన్మోహన్ సింగ్, అటల్ బిహారి వాజపేయి భారతదేశం ఒక సార్వభౌమ దేశం అని ప్రపంచానికి స్పష్టంగా తెలిపారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విదేశీ ప్రభావాలకు లోనవుతున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ముఖ్య నాయకుల్లో ఒకరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అలాగే ఇతర మిత్రపక్ష నాయకులు రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళల సామర్థ్యాన్ని గౌరవించడమే నిజమైన భక్తి

పీలేరు మార్చి 8 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ ఫంక్షన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు కవిత ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్‌హెచ్‌డి.ఈ. సుజాత, పీలేరు ఏ.పీ.పి, శారద, వివిఎన్ విద్యాసంస్థల అధినేత, మాధవి, సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి ఎల్ వెంకటేష్ హాజరై ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ "యాత్రా నారేసు పూజతే తత్ర దేవత" అనే శ్లోకంతో ఎక్కడ మహిళలను పూజిస్తారు అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని ప్రసంగిస్తూ మహిళల పట్ల చులకన భావంతో చూడకూడదు – వారిని గుర్తించడం, గౌరవించడమే మన సంస్కారం అని వారు ఉన్నారు మహిళ హక్కుల కోసం అనేక చట్టాలు వచ్చాయన్నారు అందులో భాగంగా. హిందూ మ్యారేజ్ ఆక్ట్ 1955 మరియు హిందూ కోడ్ బిల్ (హిందూ మరియు మైనారిటీ కోడ్ బిల్ 2025) లాంటి చట్టాలు మహిళల హక్కులను బలోపేతం చేస్తూ, వివాహం, వారసత్వం, విడాకుల్లో సమానత్వాన్ని నిర్ధారిస్తున్నాయి. ఈ చట్టాలు మన సంస్కారాన్ని ఆధునికీకరిస్తూ, మహిళలకు న్యాయం అందిస్తున్నాయని చదువుకుని, హక్కులు తెలుసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని వారు పిలుపు ఇచ్చారు. ఈ దేశంలో గత చరిత్ర చూస్తే మహిళల అభ్యున్నతికి జీవనాధారంగా నిలిచిన మహనీయులను స్మరించుకోవాలన్నారు 1835 నుంచి సావిత్రిబాయి పూలే గారు శ్రీవిద్య కోసం

అహర్నిశలు కష్టపడ్డారని ఆ తర్వాత ఝాన్సీ లక్ష్మీబాయి గారు విరోచిత పోరాటంతో ధైర్య సాహసాలను మహిళలకి పరిచయం చేశారన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందు సాగాలని ఆత్మగౌరవంతో బ్రతకాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పీలేరు ప్రభుత్వ వసతి గృహాల అధికారులను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు సలోమి మాధవి, రమాదేవి, కుసుమ, మహిళా నాయకురాలు, తప్పయి బేబీ, గాయత్రి, లక్ష్మి, వారితో పాటు పట్టణంలోని మహిళలు విద్యార్థు లు నాయకులు గిరి ,గురప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంలో స్త్రీ యొక్క ప్రాముఖ్యతపై కార్యక్రమం

తొండూరు మార్చి 8 ప్రభాతవార్త:

శాఖ గ్రంథాలయం తొండూరు నందు ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకి 6 వ తరగతి,7 వ తరగతి, 8 వ తరగతి పిల్లలకి సమాజంలో కుటుంబంలోస్త్రీ యొక్క ప్రాముఖ్యత అనే అంశం మీద వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు శివమోహన్ రెడ్డి సతీమణి మాజీ ప్రెసిడెంట్ విజయమ్మ మరియు బాసర విద్యాసంస్థల హెచ్ఎం భాగ్యలక్ష్మి అందులో పనిచేసే ఉపాధ్యాయులు మరియు ఐటి కాలేజీలో పని చేసే మహిళా ఉద్యోగి సరోజ మరియు గ్రంథాలయ సిబ్బంది బయమ్మ మరియు పిల్లలు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో మొదట వందేమాతరం గీతం పాడి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది అనంతరం మన ప్రథమ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటంనకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం పిల్లలను ఉద్దేశించి మహిళా దినోత్సవ సందర్భముగా మాజీ ప్రెసిడెంట్ విజయమ్మ చక్కటి విషయాలను పిల్లలకు తెలియజేశారు స్త్రీల గురించి మరియు ఇలా ఎన్నో విషయాలు తెలుసుకొనుటకు పిల్లలందరూ క్రమం తప్పకుండా గ్రంథాలయాన్నికి రావాలని వారికి తెలియజేశారు అలాగే బాసర స్కూల్ హెచ్ఎం సమాజంలో స్త్రీ యొక్క ప్రాధాన్యత ఎంతో గొప్పది అని తెలియజేస్తూ మరియు సునీత విలియమ్స్ గురించి, ఝాన్సీ లక్ష్మీబాయి గురించి చక్కటి విషయాలను పిల్లలకు బోధించి ఇలాంటి అనేక సంగతులను సమాజంలో ప్రభావవంతంగా పనిచేసినన స్త్రీల గురించి తెలుసుకొనడానికి గ్రంథాలయానికి వచ్చి ఇక్కడపిల్లల కోసం ఏర్పాటు చేసిన పుస్తకాలను చదివి తెలుసుకోవలసిందిగా వారికి తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో విచ్చేసిన అధితులకు శాలువలతో చిర సత్కారాన్ని చేశారు. అనంతరం ఈ యొక్క పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ ద్వితీయ బహుమతులు తరగతుల ప్రకారము అతిథుల చేతుల మీదుగా వారికి బహుమతుల ప్రధానం చేయడం జరిగినది అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ ను కట్ చేసి అందరూ సంతోషంగా ఒకరికొకరు తినిపించుకున్నారు అనంతరం ఈ వేడుకలను ముగించడం జరిగింది అని గ్రంథాలయ అధికారిని ఎస్. స్వరూపారాణి తెలియజేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు

చిన్నమండెం మార్చి 08 ప్రభాతవార్త:

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల ప్రకారం, దినివీగ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు రైతు సాధికార సంస్థ సూచనల ప్రకారం అన్నమయ్య జిల్లా డీపీఎం వెంకట మోహా న్ ఆధ్వర్యంలో 08.03.2026 తేదిన మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సందర్భంగా చిన్నమండెం మరియు SERP సిబ్బంది సహకా రంతో మండలంలోని దేవగుడిపల్లి గ్రామంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అన్నమయ్య జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గారు మహిళ సంఘాల్లోని మహిళలను ఉద్దేశించి మాటాడారు. మహిళలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించి ప్రాసెసింగ్ చేయించి మహిళ సంఘాల సారధ్యంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్ర మం ద్వారా అందుబాటులోకి తీసుకురాబడిన ఎక్కువగా పోషక విలువలు ఉన్నటువంటి నాణ్యమైన ఉత్పత్తులను అందరు మహిళలు కొనుగోలు చేసు కుని మంచి ఆహారాన్ని తీసుకోవడం వలన మెరుగైన ఆరోగ్యాన్ని పెంపొందిం చుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని పురష్కరించుకుని మహిళ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని మహిళ సంఘంలోని సభ్యురాళ్ళకి మహిళల గౌరవర్థం డీపీఎం, సెర్ప్ సిబ్బంది చేతుల మీదుగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నమండెం మండలం లోని దేవగు డిపల్లి గ్రామసమైక్య అధ్యక్షురాలు, సంఘ సభ్యులు మరియు ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు, రైతు సాధికార సంస్థ మండల సిబ్బంది, మండల సమాఖ్య శీనిశిశి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ఎంపిడిఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవవేడుకలు

రామసముద్రం మార్చి 8 ప్రభాతవార్త:

రామసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ డిప్యూటీ ఎంపిడిఓ ముందుగా మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, కుటుంబ విలువలను కాపాడడంలో, ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధికి మహిళలు చేస్తున్న సేవలు అమూల్యం. ధైర్యం, సహనం, ప్రేమ, త్యాగం అనే మహత్తర గుణాలకు మహిళలే ప్రతిరూపం. మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లతీఫ్ ఖాన్, గఫూర్ మండలప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్ లు రుక్మిణమ్మ గెవన్న మహిళామూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

ప్రొద్దుటూరు మార్చి 8 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంపీడీవో ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ మహిళల యొక్క హక్కుల గురించి అన్ని రంగాలలో మహిళలు పురుషులతో పాటు సమానంగా అభివృద్ధి చెందాలని ఆయన తెలిపారు తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను సమీపంలో గ్రంధాలయమునకు వచ్చే విధంగా ప్రోత్సహించినచో పిల్లలు జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు అందరూ మహిళలు వారి పిల్లలను గ్రంథాలయానికి పంపి పిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు మరియు పురుషులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

తంబళ్లపల్లె మార్చి 8 ప్రభాతవార్త ః

రాష్ట్ర మహిళల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఐకెపి ఏపిఎం గంగాధర్, సిడిపిఓ సుజాతల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర పాల ఏకిరి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర నాయుడు మాట్లాడుతూ మహిళాభివృద్ధి కోసం మూడు దశాబ్దాల క్రితమే చంద్రబాబు డ్వాక్రా పొదుపు సంఘాలతో వారిలో చైతన్యం తెచ్చి నేడు సంఘాల బలోపేతమై లక్షాధికారులు కావడానికి దోహద పడినట్లు చెప్పారు. జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి మహిళా సంక్షేమ ధ్యేయంగా టిడిపి నిలవడానికి సీఎం చంద్రబాబు నాయుడు కృషే కారణమన్నారు. టిడిపి మహిళా నాయకురాలు సిద్ధమ్మ మాట్లాడుతూ మహిళలు సీఎం చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో మహిళలు లక్షాధికారులుగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐకెపి మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, మహిళా సిసి ఆదిలక్ష్మి, వివో సభ్యులు, ఆరు మండలాల అంగన్వాడీ సూపర్వైజర్లు, మహిళా సంఘ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు సరికాదు

బద్వేల్, మార్చి 8, ప్రభాతవార్త

గ్యాస్ ధరలను పెంచుతూ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రభుత్వాలకు సిగ్గుచేటు అని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఆదివారం నెల్లూరు రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులు, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాడుల ప్రభావంతో చమురు మార్కెటింగ్ సంస్థలు ఎల్పీజీ సిలిండర్ల ధరలను పెంచాయని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న పరిస్థితిలో గ్యాస్ ధరల పెంపు సామాన్య మరియు మధ్యతరగతి ప్రజలపై మరింత భారం మోపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, బి. అనిల్ కుమార్, ఏరియా కార్యవర్గసభ్యులు కే.బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ రచ్చబండ కార్యక్రమం

పీలేరు మార్చి 08 ప్రభాతవార్త:

కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

సమిష్టి కృషితో వైఎస్సార్సీపీని బలోపేతం చేద్దామని పార్టీ మండల కన్వీనర్ దందు జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జాండ్ల పంచాయతీలో వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ రచ్చబండ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలని కోరారు. గ్రామ కమిటీలకు పార్టీలో ప్రత్యేక స్థానం ఉంటుందని తెలిపారు. గ్రామ కమిటీల సంక్షేమానికి రూ. 5 లక్షల బీమా సౌకర్యం కూడా పార్టీ కల్పిస్తున్నట్లు చెప్పారు. అందరూ కలసి కట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, నాయకులు దినకర్ రెడ్డి, ఉత్తమరెడ్డి. గంగాధర్, వెంకటేశ్వరరెడ్డి. లక్ష్మీనారాయణ, మోహన్, రఫీ. మహేష్, రాజాసాహెబ్, నరసింహులు, శేషాద్రి పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నందలూరు, మార్చి 8, ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజంపేట పట్టణం సిటీ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నందలూరు కు చెందిన మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసిల్దార్ పీర్ మున్ని పాల్గొన్నారు. నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలకు చెందిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని డాక్టర్ కె శర్వాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎన్ గౌరీ, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సుస్మిత, గొల్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని నాగమల్లేశ్వరిలు సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

సీనియర్ సిటిజన్స్‌చే చైర్‌పర్సన్‌కు సన్మానం

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

సన్మానం చేస్తున్న దృశ్యం

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైరెపర్సన్ మనూజాను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిఆర్‌టి ఇంగ్లీష్‌మీడియ హైస్కూల్‌లో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలక్రిష్ణఅధ్యక్షతన, కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్ మహిళ ప్రతినిధి సరస్వతి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. అనంతరం లయన్స్ క్లబ్ రూరల్ అధ్యక్షులు డాక్టర్ అప్పినిపల్లి భాస్కరాచారిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ గొల్లపూడి తిరపతి రావు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ నాయకులు తిమ్మయ్య, రచయిత టిఎస్ఎ.క్రిష్ణమూర్తి, యుగంధర్ ఆచారిలు విధాత చలనచిత్ర నిర్మాత, కథా నాయకుడు భాస్కరాచారికి శాలువ కప్పి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటి మార్చి 8 ప్రభాతవార్త

రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, సుండుపల్లె, వీరబల్లి, యర్రావారిపాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, పీలేరు, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్.పి.కుంట, చక్రాయపేట, కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 25 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గుర్రంకొండ మం డలం నడిమికండ్రిగ పంచాయతీలోని మోటుకు గ్రామానికి చెందిన దాత ఎ న్నారై ఎర్రగొండ గోవర్దన్ రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆత్మాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాయతీయ మహిళా దినోత్సవ వేడుకలు

సిద్ధవటం మార్చి ప్రభాతవార్త:

11వ పోలీస్ బెటాలియన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, కమాండెంట్ కే ఆనంద రెడ్డి సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి కమాండెంట్ సతీమణి ఆఫీస్ సూపర్డెంట్ ముంతాజ్ బేగం హాజరైనారు. అనంతరం మహిళలు వేసినటువంటి ముగ్గులను పరిశీలించి విజేయతలను ఎంపిక చేశారు. స్త్రీ సమానత్వం అంటే పురుషులతో పోటీ కాదు, ఒక మనిషిగా ఆమెకు దక్కాల్సిన గౌరవం మరియు అవకాశాలను కల్పించడం. కుటుంబ బాధ్యతలను మోస్తూనే, వృత్తిపరమైన లక్ష్యాలను సాధిస్తున్న మహిళలందరికీ మనం హ్యాట్సాఫ్ చెప్పాలి. జిల్లా పరిషద్ హై స్కూల్ లో 9వ మరియు 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు మహిళా సాదిరిక అంశం గురించి వ్యాస రచన మరియు ప్రసంగం పోటీలలో విజేతలకు మరియు ముగ్గులపోటీలలో, మ్యూజికల్ చైర్స్, పోటీలలోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ లు, ఏఆర్ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది, స్కూల్ హెడ్ మాస్టర్ పోతులురయ్య, టీచర్లు మరియు విద్యార్థినిలు బెటాలియన్ లోని మహిళలు పాల్గొన్నారు.

నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో నారి శక్తి పురస్కారం

మైదుకూరు, మార్చి 08, ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026 సందర్భంగా నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని హెచ్.సి.సి హాస్పిటల్ డాక్టర్ శ్రీలలితకు నారిశక్తి పురస్కారం 2026 అందజేసి శాలువాతో సత్కరించటం జరిగింది. ఈ సందర్భంగా నేస్తం సేవా సంస్థ సభ్యులు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చారి టబుల్ ట్రస్ట్ ప్రతినిది మాలకొండయ్య మాట్లాడుతూ డా. కె.శ్రీలలిత సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని విద్య, వైద్యం ,సామాజిక సేవ ,ప్రజాసేవ వంటి అనేక రంగాల్లో విశిష్ట సేవలు అందించడంతో పాటు హాస్పిటల్ కు వచ్చే పేషేంట్స్ ను తల్లిలా చూస్తూ సమాజం పట్ల బాధ్యతలు నేర్పించడం లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోగటం కొండారెడ్డి, ముడమాల చెన్నకేశవరెడ్డి, ఏ. వన్. కృష్ణ, పండు, మాలకొండయ్య, హాస్పిటల్ సిబ్బంది ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బ్రహ్మంగారిమఠం మార్చి 08 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో అవోపా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమ్మవారి శాల అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు సతీమణి సౌమ్య దీప్తికి మరియు ఆర్యవైశ్యా మహిళలకు శాలువాలతో పూలమాల లతో అవోపా అధ్యక్షుడు ముచ్చర్ల శేషయ్య, కార్యదర్శి పత్తి సురేష్ అవోపా సభ్యులు అర్యవైశ్య మహిళలు సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో అవోపా కోశాధికారి బింగి సురేష్, ఈసీ సభ్యుడు శ్రీ బింగి సూర్యనారాయణ ఉపాధ్యక్షులు చిన్న సిద్దయ్య, సుంకు నాగేశ్వరరావు వాసవి క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణమూర్తి సుంకు సుబ్బారావు, మహిళ మండలి అధ్యక్షురాలు ముచ్చర్ల పద్మ, విజయలక్ష్మి, రుక్మిణి దేవి, స్రవంతి, సరస్వతి పాల్గొన్నారు.

హరికథాగానంలో ఉషస్సు...

కలికిరి, మార్చి 8, ప్రభాతవార్త:

ఆ కుటుంబం వంశపారంపర్యంగా కళాకారుల కుటుంబం. ఆది నుంచి ఇంట్లో కళల గురించి రామాయణం, మహాభారతం గురించి చర్చించేవారు. తండ్రి మోహన్‌నాయుడు, తల్లి పద్మ లు మంచి నాట్యకళాకారులు. ఇలా ఇంట్లో నిత్యం కళానైపుణ్యం పుచ్చుకున్న ఆ అమ్మాయి గాన చతురతతో మహాభారతయజ్ఞంలో హరికథలతో అందరిని అలరిస్తోంది. ఆమె మద్దిపట్ల ఉషారాణి. తిరుపతికి చెందిన మోహన్‌నాయుడు, పద్మల కుమార్తె మద్దిపట్ల ఉషారాణి చిన్నప్పటి నుంచి మహాభారతం, రామాయణం పట్ల ఆసక్తి చూపేది. కుమార్తె ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు ఆమెకు హరికథా గానం నేర్పించారు. దీంతో ఉషారాణి మహాభారత యజ్ఞంలో హరికథలతో మహాభారత ఘట్టాలను అటు రమణీయంగా వివరిస్తూ భక్తులను ఆకట్టుకుంటోంది. మర్రికుంటపల్లె పంచాయతీ మేడికుర్తి క్రాస్ సమీపంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఇడంబాసుర వధ హరికథను ఆలపించి అందరిని అలరించింది. ఈ మహాభారత యజ్ఞం పీలేరు శ్రీ వెంకటేశ్వర నాట్యకళామండలి మేనేజర్ వీరభద్ర ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తబలిస్ట్ ఆంజనేయులు, హార్మోనిస్ట్ హరిబాబు గ్రామపెద్దలు పాల్గొన్నారు. మేనేజర్ వీరభద్ర మాట్లాడుతూ శుక్రవారం పగలు ద్రౌపది కల్యాణోత్సవ కార్యక్రమం ఉభయదారులుగా స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, ఆయన సతీమణి మంజువాణిలు వ్యవహరిస్తారని మేనేజర్ తెలిపారు.

నేడే సీఆర్‌పీఎఫ్ క్యాంప్ వద్ద ఉచిత వైద్యశిబిరం

కలికిరి, మార్చి 8, ప్రభాతవార్త:

కలికిరి మండలం పత్తేగడ పంచాయతీలో ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంప్ వద్ద ఈ నెల 9వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఖాదర్‌బాషా తెలిపారు. 87వ సీఆర్‌పీఎఫ్ రైజింగ్ డే సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే రోగులు కచ్చితంగా ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఉచిత వైద్యశిబిరానికి ఎవరైనా ద్విచక్ర వాహనాల్లో వస్తే హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు. వైద్యశిబిరంలో వైద్యాధికారులు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నిక..

కడప కార్పొరేషన్ మార్చి 8 ప్రభాతవార్త:



బిజెపి కడప జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి చిక్యాల సుమతి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎన్.నాగపల్లవి లను నియమించారు. మహిళ దినోత్సవ సందర్భంగా కడప జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్. మాధవ్, జిల్లా బిజెపి అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నూతన కార్యవర్గంలో పదోన్నతిలో భాగంగా జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా చిక్యాల సుమతి, ఎన్.నాగపల్లవిలు మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు పార్టీ పెద్దలకు మహిళా అధ్యక్షురాలికి ధన్యవాదాలు తెలిపారు.

టీటీడీ ఈఓ రవిచంద్రకు శ్రీశైలం ప్రసాదం

రాజంపేట, మార్చి 8 ప్రభాతవార్త:

టిటిడి నూతన ఈవో ముద్దా రవిచంద్రను శ్రీశైలం ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ప్రసాదాన్ని ఈఓకు అందజేశారు. స్వామి శేష వస్త్రంతో ఈవోను సన్మానించారు. దోర్నాల వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన డార్మెటరీ , చౌల్ట్రీ గురించి ఈఓ తో చర్చించడం జరిగింది. త్వరలో జరిగే బోర్డు మీటింగ్లో దానిమీద చర్చిస్తామని యు రమేష్ కు హామీ ఇచ్చారనీ తెలిసింది. అందుకు ఆలయం తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈఓ వెంకయ్య చౌదరిని కూడా శ్రీశైలం చైర్మన్ రమేష్ నాయుడు కలిసి సన్మానించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

రాయచోటి మార్చి 8 ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎన్జీవోస్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సభకు మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్ యం ప్రతిభ కుమారి అధ్యక్షత వహించగా ముఖ్య అతిధి అడిషనల్ డి.యం. హెచ్.వో. డా.రాధిక విచ్చేశారు. ఆమె సందర్భంగా మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో సురక్షితంగా ఉండాలని, మహిళ ఉద్యోగులు తమ తమ రంగాల్లో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని, పిల్లలు పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగా పెరగాలంటే వాక్సినేషన్ చేసే ఏ ఎన్.ఎం మరియు క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు అనిర్వచనీయమైన సేవలని పిలుపునిచ్చారు. ఎపి యన్ జి ఓస్ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. ఏపీ ఎన్జీజీఓఖిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు గృహ అవసరాల కోసం మాత్రమే కాకుండా ప్రపంచమంతా విద్య ఉద్యోగ ఆర్థిక సామాజిక రంగాల్లో రాణిస్తున్నట్లు తెలియజేశారు. మహిళా విభాగం చైర్ పర్సన్ యం ప్రతిభ కుమారి మాట్లాడుతూ గత దశాబ్దంలో స్త్రీ, పురుష నిష్పత్తి లో పురుషాధిక్యత ఉండేదని కానీ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ చేసిన విశేష కృషి కారణంగా కాలానుగుణంగా వచ్చిన మార్పులు, అవగాహన వల్ల స్త్రీ పురుష నిష్పత్తి లో స్త్రీల సంఖ్య పెరగడమే కాకుండా స్త్రీ, పురుష సమానత్వం పెరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీజీఓఖిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా వారు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీఓఖిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా సహ అధ్యక్షుడు డి వి శివారెడ్డి ఉపాధ్యక్షులు పి మహాదేవ, స్వర్ణలత ఆర్గనైజింగ్ సెక్రటరీ కె హరి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి జేఏసీ నాయకులు మహమ్మద్ భాష మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు యు నీలిమ, అర్చన, రమణమ్మ, సుహాసిని, రెడ్డమ్మ, రత్నమ్మ మరియు పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అవొప ఆధ్వర్యంలో వస్త్రాలు వితరణ

బద్వేల్ అర్బన్ మార్చి 08 ప్రభాతవార్త :

శ్రీనివాస ట్రేడర్స్ అధినేత పత్తి వెంకటసుబ్బయ్య నిరుపేద ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని వస్త్రాలను వితరణ చేయడం సంతోష్కరమని ఆవోపాకమిటి అధ్యక్షులు నూకల రెడ్డయ్య, సెక్రటరీ సి.వి నాగేశ్వరరావు అన్నారు, ఆదివారం ఆవోప ఆధ్వర్యంలో వృద్ధులకు పెన్షన్ కార్యక్రమము, వస్త్రాల పంపిణీ అలాగే ప్రతి నెల వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెడికల్ క్యాంపు మహిళా దినోత్సవ వేడుకలను ఉచిత మందుల పంపిణీ, అలాగే కీర్తిశేషులు పత్తి పద్మావతి కుటుంబ సభ్యులు మరియు రాయవరం సురేష్ బాబు కుటుంబ సభ్యుల సహకారంతో అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, తదనంతరం హైదరాబాదుకు చెందిన రెక్సర్ ఫార్మా కంపెనీ అధినేత మదనపల్లి సూర్య మోహన్ కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత మందుల పంపిణీ, డాక్టర్ బి శివాని డాక్టర్ ఆర్ఎస్ పూజిత ఆధ్వర్యంలో ఉచిత హోమియో క్యాంపును ఏర్పాటు చేసి మందులను అందజేయడం జరిగింది. బద్వేల్ ఆవోప అధ్యక్షులు నూకల రెడ్డయ్య ప్రధాన కార్యదర్శి సి వి నాగేశ్వరరావు ఆర్థిక కార్యదర్శి తులసి సుబ్రహ్మణ్యం మహిళా విభాగం అధ్యక్షురాలు సుధామణి సునీత స్వర్ణ మరియు అవోపా సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలు అందించినటువంటి ఆర్యవైశ్య మహిళలకు శాలువాలతో సత్కరించడం జరిగింది, కొండపల్లి దేవి, శ్దేవతి లలిత, దేవతి లక్ష్మీ, చింతకుంట ధనలక్ష్మి, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మకి ఘనంగా మహిళా దినోత్సవ సత్కారాలను బద్వేల్ అవోపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయుట జరిగింది, ఈ కార్యక్రమంలో ఆవోపా కమిటీ, మహిళా మండలి, వాసవి, వనిత క్లబ్ మరియు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఉన్నాయి

ప్రొద్దుటూరు మార్చి 8 ప్రభాతవార్త

మహిళలకు అన్ని రంగాల్లో నేడు సమాన అవకాశాలు ఉంటున్నాయని మహిళా విద్యను ప్రోత్సహిస్తే సమాన అవకాశాలు అందుకుంటారని డిప్యూటీ డిఎంహెచ్ఓ గీత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో హంస జిల్లా అధ్యక్షుడు బండి రాజారత్నం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సభలో జిల్లా ఆస్పత్రి సూపరెంటెంట్ డాక్టర్ ఆనంద్ బాబు మాట్లాడుతూ ఆసుపత్రికి రోగులకు అందించే వైద్య సేవలో మహిళలదే అగ్రస్థానం అన్నారు సిబ్బంది కొరత నర్సులకు పని ఒత్తిడి పెరిగిందన్నారు. పోలీస్ స్టేషన్లో కోర్టుల్లో మహిళలకు న్యాయం అందించాలని ఐక్యరాజ్యసమితి 2026 మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకటించిందన్నారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రావు ఏపీజీఈ ప్రతినిధి సునీత ఆసుపత్రి వైద్యులు నర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పోరుమామిళ్ల రూరల్, మార్చి 8 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ క్లబ్‌లో ఆదివారం ఐద్వా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు గౌసియా బేగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు అధైర్య పడకుండా చిన్న వయసు నుండే ధైర్యంతో జీవించాలని వారన్నారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలను మగ బిడ్డలతో సమానంగా చదివించినప్పుడే వారు సొంతంగా జీవించగలరన్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి వారి అభివృద్ధికి మరింత తోడ్పడడంతో పాటు రక్షణ కల్పించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుబ్బమ్మ, అధ్యక్షులు భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 8 ప్రభాత వార్త

లోక సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ ఫౌండర్ చైర్మన్ నరసింహులు ఆదేశాల మేరకు కడప జిల్లా ప్రొద్దుటూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగు రోడ్డులోని విద్యార్థి అనాధ శరణాలయంలో చిన్నారుల మధ్య ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా లోక సమస్త మహిళలు చిన్నారుల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం రాయలసీమ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై. రామిరెడ్డి చేతుల మీదుగా లోక సమస్త మహిళలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం రాయలసీమ చైర్మన్ సి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా అనాధ శరణాలయంలోని చిన్నారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజంలో మహిళల సాధికారతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై. రామిరెడ్డి, రాయలసీమ లీగల్ అడ్వైజర్ రాముడు, కడప జిల్లా అడ్వైసర్ ప్రణయ్ కుమార్, కడప జిల్లా వైస్ చైర్మన్ టి. శిల్ప, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ పి. జ్యోతిక రెడ్డి, ప్రొద్దుటూరు జనరల్ సెక్రటరీ అరుణ, ప్రొద్దుటూరు టౌన్ యూత్ వైస్ చైర్మన్ కె. సురేష్, జాయింట్ సెక్రటరీ మహ్మద్ రఫీ, ప్రొద్దుటూరు జాయింట్ సెక్రటరీ శ్రీధర్, సుబ్బరాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కలసపాడు, మార్చి 8 ప్రభాతవార్త:

మండలంలోని మహానంది పల్లి గ్రామానికి చెందిన దారం చలపతి శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలలోకెళితే ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగ పిల్లవాడు ఉండేవారు వారిలో కొడుకు భార్య చనిపోవడంతో ఆయన బీద స్థితిలో ఉన్నాడు. మనవరాలు ముగ్గురు ఆయన సంపాదనతో బతికేవారు కానీ ఆ కుటుంబ పెద్ద పోవడంతో పిల్లలు దుఃఖంతో ఉన్నారు. ప్రభుత్వం పట్టించుకోని ఆ పిల్లలకు ఏమైనా సాయం చేయాలని గ్రామంలోని ప్రజలు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కడప క్రైం, మార్చి 8, ప్రభాతవార్త:

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 225 మందిపై కేసులు నమోదు చేసి రూ.38460 జరిమానా విధించడం జరిగిందన్నారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్లలో వెళ్లే వారు సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

బద్వేల్, మార్చి 8, ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్వేల్ లోని వీరారెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియం లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టిడిపి యువ నేత రితేష్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ చైర్మన్ ముక్తియార్, బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్ర మోహన్, డీఎల్డీఓ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారత, గౌరవం మరియు ఆర్థిక స్వావలంబన కోసం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి మహిళకు పసుపు–కుంకుమతో పాటు చీరలను అందజేశారు. అలాగే భోజన ఏర్పాట్లు కూడా చేశారు. మహిళల ఆనందం, వారి ఆశీస్సులతో కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, జనసేన నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల గౌరవం, సాధికారతకు ప్రతీకగా వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవవేడుకలు

నిమ్మనపల్లి మార్చి 8 ప్రభాతవార్త

నిమ్మనపల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఎంపిడిఓ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ముందుగా మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, కుటుంబ విలువలను కాపాడడంలో, ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధికి మహిళలు చేస్తున్న సేవలు అమూల్యం. ధైర్యం, సహనం, ప్రేమ, త్యాగం అనే మహత్తర గుణాలకు మహిళలే ప్రతిరూపం. మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండలప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు మహిళామూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి

వేంపల్లి:మార్చి 08(ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలని, అంగన్వాడీ, ఆశా మహిళల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన బంగారు తల్లి, అమ్మ హస్తం పథకాలను పునరుద్ధరించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1914 సంవత్సరం నుంచి మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారతను సాధించడమే ఈ దినం లక్ష్యమని తులసి రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఉందని తులసి రెడ్డి అన్నారు. అనిబిసెంట్, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ ఏఐసిసి అధ్యక్షులుగా పదవులు అలంకరించారు. ప్రతిభా పాటిల్ రాష్ట్రపతిగా, శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా, మీరాకుమార్ లోక్సభ స్పీకర్గా ఉన్నత పదవులు అలంకరించారు. వైకాపా పాలనలో మహిళా దినోత్సవం రోజున అమరావతి మహిళ మీద దుశ్శాసనపర్వం జరగడం దురదృష్టకరమన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం అంగన్వాడీ మహిళ పట్ల వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం క్రింద పేర్కొన్న డిమాండ్లపై దృష్టి సారించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

పులివెందుల అభివృద్ధికి మరో అడుగు

పులివెందుల, మార్చి 8, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణ అభివృద్ధిపై వైఎస్ కుటుంబం చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడిపల్లి ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచనలతో, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో ఈ నిధులు కేటాయించినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యర్రగుడిపల్లి ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి వైసీపీ నాయకులతో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వ కాలంలో ఈ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినప్పటికీ, అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ రాష్ట్ర ఛైర్మన్ రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్లు కోడి రమణ, పురుషోత్తం, రాష్ట్ర నాయకులు చంద్రమోళి, కోళ్ల భాస్కర్, వైసీపీ నేతలు రమణారెడ్డి, కృష్ణమూర్తి సూరి, కనక, సమేవుల్లా, ప్రకాశం, యర్రగుడిపల్లి నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 8 ప్రభాతవార్త :

డిజిఒ డాక్టర్ జ్యోతి ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో కూడా స్త్రీ పురుష సమానత్వం పూర్తిగా రావడం లేదని, స్రీ పురుష నిష్పత్తి కూడా సమానంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆడపిల్లలకు భద్రత కరువైందన్నారు. ఇంకా ఆడపిల్లల పట్ల చిన్న చూపు చూడటం బాధాకరమన్నారు. ప్రతి ఆడవారి విజయం వెనుక తండ్రి లేదా సోదరుడు లేదా భర్త ప్రోత్సాహం తప్పనిసరిగా వుంటుందని, అలా ప్రోత్సహించే వారికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం సాధ్యమని వివరించారు. అదేవిధంగా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించిందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, తాలూకా కమిటీ లు నేడు ఈ వేడుకను నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహిళలు కూడా ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రి స్టాఫ్ నర్స్ మానస క్రీడలలో జాతీయ స్థాయిలో రాణించిన స్ఫూర్తితో అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ రామ సుబ్బయ్య మాట్లాడుతూ ఒక స్త్రీ మహిళలకు ఓటు హక్కు, పని దినాల తగ్గింపు కోసం చేసిన పోరాటం ఫలితంగానే నేటి ఈ మహిళా దినోత్సవ వేడుకలు సాధ్యమయ్యాయని వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే ఈ సంవత్సరం గివ్ టు గైన్ థీమ్ ఇచ్చారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సహకరిస్తోందని ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పోరాటం చేస్తోందని వివరించారు. అనంతరం ఇటీవల మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ప్రొద్దుటూరు కార్యదర్శి ప్రమీల, మహిళా వింగ్ అధ్యక్షురాలు అరుణాదేవి, కన్వీనర్ విజయేశ్వరీ, వైస్ ప్రెసిడెంట్ సంధ్యా రాణి,, జాయింట్ సెక్రటరీ సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా కోటపోలేరమ్మ జాతర..

పోరుమామిళ్ల రూరల్ మార్చి 8 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల పట్టణంలోని రంపాడు రోడ్డులో వెలసిన శ్రీ కోట పోలేరమ్మ జాతర పట్టణవాసులు ఘనంగా నిర్వహించారు. మేళా తాళాలతో, డప్పుల వాయిద్యాలతో, గుమ్మటి ఎద్దుల బండ్లతో, బోనాలతో పెద్ద ఎత్తున పోలేరమ్మ దేవస్థానానికి తరలివచ్చి ముడుపులు చెల్లించుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బలిజ కోటలోని కోటపోలేరమ్మకు బోనాలతో పెద్ద సంఖ్యలో కుంకుమ బండ్లతో ఊరేగిస్తూ కోలాటం వేస్తూ ముందుకు సాగారు. కోట పోలేరమ్మ జాతరలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోరుమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

వశిష్ఠ చైతన్య విద్యార్థులు ప్రతిభ

సుండుపల్లె, మార్చి 08,ప్రభాతవార్త :

విశ్వం ఏడుటెక్ హైదరాబాద్ వారు హైదరాబాద్ లో నిర్వహించిన అబాకస్ వేదిక్ మాథ్స్ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వశిష్ట మరియు చైతన్య స్కూల్ విద్యార్థులు స్టార్ జూనియర్ లెవెల్ 2 లో జె.సిద్దార్థ గౌడ్ అనే విద్యార్థి జాతీయ స్థాయిలో 3వ ప్రైజ్ సాధించడం జరిగింది.జాతీయ స్థాయి విజువలై జేషన్ పోటీ పరీక్షలలో ఎస్.నిహారిక అనే విద్యార్థిని 3వ ప్రైజ్ సాధించడం జరిగినది. అవార్డులు విశ్వం ఏడుటెక్ డైరెక్టర్ జనార్దన్ చేతులు మీదుగా అందుకోవడం జరిగినది. వశిష్ఠ, చైతన్య పాఠశాలల కరస్పాండెంట్ డాక్టర్ కె. రెడ్డయ్య రాజు మాట్లాడుతూ అబాకస్ ట్రైనర్ నాగార్జునని అబాకస్ ఉపాధ్యాయురాలు నాగవేణిని హైదరాబాద్ లో పాల్గొన్న ఉపాధ్యాయులు ఎస్. శిరీష మరియు కె. విజయకుమారిని అభినందిస్తూ ఇలాంటి అవార్డులు సాధించినందుకు హర్షం వ్యక్తం చేసారు.

కన్నుల పండుగగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం

వేంపల్లె మార్చి 08 (ప్రభాత వార్త)

స్థానిక సాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన దుర్గమ్మ నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మహోత్సవాల చివరి రోజు భాగంగా అర్చకులు బ్రహ్మశ్రీ రాయిపెద్ది సుబ్బరామశర్మ, బ్రహ్మశ్రీ శంకరమంచి సాయిప్రసాద్ నేతృత్వంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయం ప్రతిష్టా హోమం, శాంతి పౌష్టిక హోమం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు. ప్రతిష్టా మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయని, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ఫోర్డు సంస్థకు రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డులు

తంబళ్లపల్లె మార్చి 8 ప్రభాతవార్త ః

నియోజకవర్గంలో ఫోర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జె. లలితమ్మ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా క్రై సంస్థ సారథ్యంలో బాలికలు, మహిళల సాధికారితపై చేసిన కృషికి ఫోర్డు సంస్థ సభ్యులు కె.రెడ్డమ్మ,జి.అనితలకు క్రై సౌత్ రీజినల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్ రాష్ట్రస్థాయి ప్రతిభ అవార్డులు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం హైదరాబాద్ బేగంపేట టూరిజం ప్లాజాలో స్టెమ్ ఫర్ ఎవరీ గర్ల్స్ కార్యక్రమంలో జాన్ రాబర్ట్ మాట్లాడుతూ(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) రంగాల్లో విద్యావృత్తులు కొనసాగిస్తున్న బాలికల ఆశయాలను విశదీకరించారు. ఈ కోవలో ఆంధ్ర రాష్ట్రం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాలలో గత 15 ఏళ్లుగా క్రై సంస్థ సహకారంతో ఫోర్డు సంస్థ సారథ్యంలో బాలల హక్కులు, బాలికలు, మహిళల సాధికారతపై అలుపెరగని సేవలందించిన రెడ్డమ్మ, అనితలకు ప్రతిభ అవార్డులు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు అందజేశారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఈ అవార్డులు రావడానికి ఫోర్డు సంస్థ డైరెక్టర్ జె. లలితమ్మ, కన్వీనర్ ఆవుల నరసింహులు, క్రై సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్, జనరల్ మేనేజర్ పీటర్ సునీల్, ప్రోగ్రాం ఆఫీసర్లు చెన్నయ్య, రమేష్, మున్నాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కనమలో గంగమ్మ జాతర

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న కనమలో గంగమ్మ తల్లి జాతర శని, ఆదివారం రెండు రోజులు పాటు ఘనంగా జరిగింది. ఈ జాతరలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం వైఎస్ఆర్ సిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్అహ్మద్ అనుచరులతో కలసి గంగమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా భక్తులకు బిజెపి సీనియర్ నాయకులు గుత్తా చలపతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, నాయకులు ఆర్ఐ రమణారెడ్డి, మయూరి రఘునాథ్‌రెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి చింతకోటమ్మ

సుండుపల్లె, మార్చి 08, ప్రభాతవార్త :

పిలిచే పలికే దైవంగా...భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా...వెలసిన శ్రీ చింతకొటమ్మ జాతర ఉత్సవాలు రెండవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గం సుండుపల్లె మండలంలోని చిన్నగొల్లపల్లి పంచాయతీలోని పూజారివాండ్ల పల్లె వద్ద వెలసిన ప్రాచీన చింతకొటమ్మ జాతర ఉత్స వాలు మూడు రోజులు పాటు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగానే రెండవ రోజు ఆదివారం చింతకొటమ్మ అమ్మవారు గ్రామ ఊరేగింపులో భాగంగా తూర్పు హరిజనవాడ నుండి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారిని పల్లకిలో తీసుకొచ్చి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూ జలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే రాత్రి ఆషాది వారిచే అమ్మవారి కథ ఆలపించారు. అలాగే 9 వ తేదీ సోమవారం ఉదయం పుట్ట బంగారు తేవడం, పాలు పొంగపెట్టడం,కల్లు సాంగ్యం,కనక తొక్కడం,ఆషాధి వారిచే గావు పట్టడం వేడుకగా జరుగుతాయన్నారు. ఈ నెల 10వ తేదీన మంగళవారం ఉదయం మైల తిరుణాల సందర్భంగా నగిరి బోనం అ నంతరం గ్రామంలోని పలు పల్లెలో భక్తులు అమ్మవారికి బోనాల సమర్పించి జంతుబలులు ఇచ్చి మొక్కలు తీర్చుకోనున్నట్లు ధర్మకర్తలు,పూజారులు తెలియజేశారు.

ఉచిత పశు వైద్య శిబిరాన్ని జయప్రదం చేయండి

రాయచోటి మార్చి 8 ప్రభాతవార్త

ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాము రైతులందరూ వచ్చి జయప్రదం చేయవలసినదిగా రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి రైతులను కోరారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రవాణా యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశానుసారం, వారి ఆధ్వర్యంలో చిన్నమండెం మండలం, నడిగడ్డ పల్లి యందు ఈరోజు 9/03/2026న ఉదయం 7 గంటలకు ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి, నిర్వహిస్తున్నామని కావున మార్కెట్ కమిటీ సభ్యులు మరియు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలను, కమిటీ సభ్యులను అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

జిల్లా ప్రెసిడెంట్గా రాజశేఖర్

కడప మార్చి 08, ప్రభాతవార్త :

జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ నందు జరిగిన జనరల్ బాడీ ఎలక్షన్స్ నందు రాజశేఖర్ సీనియర్ అసిస్టెంట్ కడప రూరల్ వారు జిల్లా ప్రెసిడెంట్గా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినది. వైస్ ప్రెసిడెంట్ గా ఎస్ ఈశ్వరయ్య జనరల్ సెక్రటరీగా సిహెచ్ విజయరాజు జాయింట్ సెక్రటరీగా ముని వెంకటరత్నం ట్రెజరర్గా ప్రవీణ్ ఈసీ మెంబర్లగా రమేష్, అరుణ్ కుమార్, పూల సురేంద్ర లేడీ నెంబర్గా జే భారతి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ ఎ న్నిక డిస్టిక్ రిజిస్టార్ పివిఎన్‌బాబు మరియు సబ్ రిజిస్టర్లు ఎస్ అబ్దుల్ సత్తార్, ఏ అజీజుల, డిఎం భాష వీరి సమక్షంలో బాడీని ఎన్నుకోవడం జరిగింది.

మహిళాభ్యున్నతే దేశాభ్యున్నతి..

ఎడ్యుకేషన్ మార్చ్ 8 ప్రభాతవార్త :

మహిళాభ్యున్నతే దేశాభ్యున్నతి అని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడప పట్టణంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల నందు ఆపస్ జిల్లా అధ్యక్షులు చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించబడిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే ఆ దేశాలు అభివృద్ధి చెందుతాయని అందువలన సమాజము, ప్రభుత్వము మహిళల అభ్యున్నతి కోసము కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు శెట్టెం చెన్నయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతీయ సంస్కృతి మహిళలకు ప్రత్యేక స్థానం ఇచ్చిందని, మాతృదేవోభవ అని భగవంతుని కంటే ముందు అమ్మను పూజించమని తెలియజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగరాజు, చంద్రమోహన్, మీడియా ఇంచార్జ్ బాలకృష్ణుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నాగమునీశ్వర రెడ్డి, రాజంపేట ప్రాంత బాధ్యులు గోవిందమ్మ, వివిధ డివిజన్ల, మండలాల బాధ్యులు, ఏపీజీఈఏ మహిళా విభాగ రాష్ట్ర అసోసియట్ ప్రెసిడెంట్ డాక్టర్ నీలవేణి, నీలకంఠ రావు పేట ప్రధానోపాధ్యాయురాలు నీరజారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకం

మహిళా దినోత్సవం లో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట,మార్చి 8 ప్రభాతవార్త

సృష్టికి మూలం అమ్మ అని, సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమని, రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్య జగన్మోహన్ రాజు అన్నారు. రాష్ట్రంలో మహిళలను మహారాణులుగా చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ముఖ్యంగా మహిళలను లక్ష అధికారులుగా చేయాలన్న లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.ఆదివారం స్థానిక సి.టీ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాజంపేట సబ్ కలెక్టర్ భావన ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బిజెపి పార్లమెంటు అధ్యక్షుడు సాయి లోకేష్, జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ భారతదేశానికి భరతమాత అనే పేరు ఉందని అంటే దేశంలో మహిళలకు ఎంత గౌరవం ఉందో ప్రపంచానికి తెలుసన్నారు. అటువంటి దేశంలో మహిళా పక్షపాతి అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో మహిళలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలబెట్టాలని అంకిత బాబుతో కృషి చేస్తున్నారన్నారు. మహిళల కోసం పనిచేసే ప్రభుత్వం కొనసాగుతుండడం మహిళలకు మరింత శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని,తద్వారా గ్రామం,రాష్ట్రం చివరకు దేశం కూడా బాగుంటాయన్నారు. మహిళలు ముందంజలో నిలుస్తూ,సమాజానికి మార్గదర్శకులుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చమర్తి కొనియాడారు. రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచే నాయకత్వ లక్షణాలు పునికి పుచ్చుకొని ఉంటారని పేర్కొన్నారు. మహిళల సక్సెస్ కు ఇంటి నుంచే ప్రోత్సాహం ఎంతైనా అవసరం అన్నారు. వివిధ రంగాలలో సక్సెస్ సాధించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బిజెపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయి లోకేష్ మాట్లాడుతూ మహిళా శక్తి సమాజానికి ఎంతో అవసరం అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పీర్ మున్ని, జెడ్పిటిసి ప్రశాంతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కడప కార్పొరేషన్ మార్చి 8 ప్రభాతవార్త:

మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సేవా రంగాల్లో పోటీ పడి రాణిస్తున్నారని కడప జిల్లా యన్ జి జి వో స్ అధ్యక్షులు బి.శ్రీనివాసులు చెప్పారు. రాష్ట్రపతి, కేంద్ర ఆర్థిక మంత్రి ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళలే అని వారిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎపి.యన్.జి.జి.వో.స్ అసోసియేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం కడప ఎన్ జి జి వో. స్ హోమ్ లో ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీల్లో లెమన్ స్పూన్, త్రోబాల్,టగ్గా ఫర్, కబడ్డీ, డిస్క్ త్రో, జావిల్లిన్ త్రో, మ్యూజికల్ చైర్స్, పోటిలల్లో గెలుపొందిన మహిళలందరికి బహుమతులు ప్రదానం చేసారు. సభా అధ్యక్షులుగా ఉమెన్ వింగ్ ఛైర్మెన్ బి. కృష్ణకుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిధిలు జిల్లా యన్ జి జి వో స్ అధ్యక్షులు బి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పి. నిత్యపూజయ్య, ఉమెన్ వింగ్ కన్వీనర్ ఎన్ ఎం. సునీత, ప్రత్యేక ఆహ్వానితులు జిల్లా ఛైర్మెన్ బి. కృష్ణ కుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని. ప్రతి మహిళా విద్యావతులు కావాలన్నారు. కన్వీనర్ ఎన్ ఎం సునీత మాట్లాడుతూ జిల్లా ఏపీ యన్ జి జి వోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహించమన్నారు. ఈ కార్యక్రంలో ఏపీయన్‌జిజివో జిల్లా కోశాధికారి, టీ. శ్రీనివాసులు, సిద్దయ్య, రాజశేఖర్, బాలపుల్లయ్య, ఎం. లక్ష్మీదేవి, సుహాసిని కుమారి, పద్మనాభ రావు బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి సాంబశివరావు, డా. రాఘవేంద్ర కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, రాజు, నాగార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య విద్య ఫలితాల్లో తనూజకు గోల్డ్ మెడల్

బద్వేల్ అర్బన్, మార్చి 8, ప్రభాతవార్త

నియోజకవర్గంలోని అట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని నల్లగొండుగారిపల్లి గ్రామానికి చెందిన కాసల కోనయ్య కుమార్తె తనూజ వైద్య విద్యలో ప్రతిభ చాటింది. కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న ఆమెకు తాజాగా విడుదలైన మూడవ సంవత్సరం ఫలితాల్లో కాలేజీ టాపర్‌గా నిలిచింది. అలాగే కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌ను సాధించింది. కోనయ్య దంపతుల పెద్ద కుమారుడు కాసల సాయి శశిధర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ హౌస్ సర్జన్‌గా సేవలు అందిస్తున్నాడు.మారుమూల గ్రామంలో జన్మించి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సంతానం వైద్య విద్యలో రాణిస్తూ గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణమని మండల ప్రజలు అభినందిస్తున్నారు.

మహిళా భద్రతా వాహనం ప్రారంభం

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నందు ఆదివారం ప్రభుత్వం మహిళలకు మంజూరు చేసిన భద్రతా వాహనాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుటుందన్నారు. ముఖ్యంగా ఆపదలో ఉన్న మహిళలకు అపర్ణ అప్పన్న హస్తం సఖీ వన్ స్టాప్ సెంటర్ ఒకే చోట అన్ని సేవలు కల్పించేందుకు భద్రతా వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు భద్రతా విషయంలో, కుటుంబకలహాల విషయంలో సమస్యలు పరిష్కరించడానికి వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడి హైమావతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరువు వర్గాలవారు ఘర్షణ...

ముద్దనూరు, మార్చి08 ప్రభాతవార్త:

మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం వ్యవసాయ బోరు నీటి విషయంపై ఘర్షణ పడినట్లు స్థానికులు తెలిపారు. ఇరు వర్గాల ఘర్షణ పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తూ ఉండగా యామవరం గ్రామం శివాలయం రహదారి సమీపంలో మరో వర్గం వారు అడ్డగించి విజయ్ కుమార్‌ను గాయపరిచినట్లు బాధితులు తెలిపారు. గాయపడిన వారు ప్రొద్దుటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఉండగా మరో వర్గం వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ

పులివెందుల,మార్చి 8, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృహం-2ను శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని గదులు, వంటశాల మరియు పరిసరాలను స్వయంగా పరిశీలించిన ఆయన, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి అక్కడి పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిరోజూ కోడిగుడ్డు, పాలు మరియు ఇతర పోషకాహార పదార్థాలు సక్రమంగా అందుతున్నాయా అని తెలుసుకున్నారు. వసతి గృహంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. అలాగే వసతి గృహ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి, మంచి చదువుతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని ప్రోత్సహించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో కొనుగోలు చేసిన క్రికెట్ కిట్టును విద్యార్థులకు అందజేశారు. క్రీడలు శారీరక ధృఢత్వం పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని ఆయన తెలిపారు.

పీలేరులో మహిళా పాడి రైతులకు ఘనంగా సత్కారం

కేవీ పల్లె,మార్చి 08 ప్రభాతవార్త:

పీలేరులో మహిళా పాడి రైతులను ఘన సన్మాన, సత్కారాలు లభించాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక హెరిటేజ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో మేనేజర్ శివకుమార్ సంస్థ ద్వారా మహిళా పాడి రైతులు, మహిళా సిబ్బందికి శాలువాలు కప్పి స్వీట్స్ అందించి గౌరవంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. కుటుంబ ఆర్థికాభివృద్ధికి మహిళా రైతులు చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలకు ఆదర్శంగా నిలుస్తూ, సమాజ అభివృద్ధికి దోహదపడుతున్నారని ఆయన కొనియాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పాడి రైతులను గౌరవించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ స్వరణ్ రాజ్ నాయక్, హెరిటేజ్ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు మహిళా పాడి రైతులు పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆద్యాంతం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

బద్వేల్ లో ఘనంగా వార్త సిఎండి డాక్టర్ గిరీష్ కుమార్ జన్మదిన వేడుకలు

బద్వేల్ అర్బన్ మార్చి 08 ప్రభాతవార్త :

వార్త జాతీయ దినపత్రిక సీఎం డి డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ జన్మదినోత్సవం సందర్భంగా బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ వెంకటేష్, అర్బన్ రిపోర్టర్ వ్నల్లకొండు వెంకటరమణ, గోపవరం రిపోర్టర్ కటారు రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం బద్వేల్ పట్టణంలోని వాసవి మెడికల్ స్టోర్ వద్ద ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది, ఉచిత మెడికల్ క్యాంపులో పది రకాల (1900) విలువచేసే రక్త పరీక్షలు బీపీ షుగర్ సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించడం జరిగింది, అనంతరం అనాధ వృద్ధులకు ఫ్రూట్స్ తినుబండారాలు వితరణ చేపట్టడం జరిగింది, అలాగే వివిధ శాఖలలోని సేవలు అందించిన పలువురు మహిళలకు శాలువా తో సత్కరించి అనంతరం ప్రత్యేక కేక్ కట్ చేసి డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, కే.వీ సుబ్బారావు,పబ్బతి చంద్రశేఖర్,రాగిమాను ప్రతాప్ కుమార్, సి.వి నాగేశ్వరరావు, సగల రాజా, కొలిశెట్టి చంద్ర, ఫైడిమర్రి సురేష్ బాబుతో పాటు సంజీవని హాస్పిటల్స్ సిబ్బంది పిఆర్వో మద్దూరు సుబ్బారాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ మద్దూరు చందు, గొంది సుస్మిత,వినయ్ పలువురు పాల్గొన్నారు.